క్లుప్తంగా

ఉపకరణాల పంపిణీ వేదిక మార్పు

పొదలకూరు: వెంకటాచలంలో ఈ నెల 15న దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేసే వేదిక మార్పు చేసినట్లు ఎంపీడీఓ నగేష్ కుమారి గురువారం తెలిపారు. ముందుగా వెంకటాచలం కమ్యూనిటీ హాల్‌ను ప్రకటించామని, తర్వాత అధికారులు జెడ్పీ హైస్కూల్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉపకరణాల కోసం వెళ్లే దివ్యాంగులు ఈ మార్పును గమనించాలని సూచించారు.

సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించండి

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో బి.పి.ఈ.డి. సప్లిమెంటరీ పరీక్షలు వెంటనే నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని కాకుటూరులో ఉన్న వీఎస్‌యూలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డిని ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్‌కిషోర్, మట్టిగుంట బాబ్జి, రత్నంరాజు కలిసి వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి 2021 వరకు చదువుకున్న విద్యార్థులకు సప్లిమెంటరీ నిర్వహించకుండా, గ్రేస్ పీరియడ్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, వెంటనే పరీక్షలు నిర్వహించాలని కోరారు.

విచారణ జరపాలి

బుచ్చిరెడ్డిపాళెం: కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని పెద్దపులి గ్రామానికి చెందిన దళిత యువకుడు జీవన్ హత్యపై వెంటనే విచారణ జరపాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాళెంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. జీవన్‌ను అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటనపై వెంటనే విచారణ జరిపి దోషులకు కఠిన శిక్షలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వేదగిరిలో హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీ కానుకలను గురువారం లెక్కించారు. కానుకల రూపంలో భక్తులు రూ.7,74,154 మేర సమర్పించారు. నిత్యాన్నదానానికి రూ.80,353 మేర అందజేశారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



నెల్లూరు(టౌన్): వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులతో పనిచేయించడాన్ని నిలిపేయాలని ఫ్యాప్టో చైర్మన్ సురేంద్రరెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ నారాయణరావుకు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ రమేష్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ శేషు, కార్యవర్గ సభ్యులు దశయ్య, రాజమనోహర్, మురళీధర్, మునాఫ్, చలపతి, పిచ్చిబాబు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టరూ..

నెల్లూరు(టౌన్): వేసవి సెలవుల్లో తరగతులను నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల యాజమాన్యలపై చర్యలు చేపట్టాలని ఆలిండియా స్టూడెంట్స్ బ్లాక్ అధ్యక్షుడు చైతన్య కోరారు. ఈ మేరకు స్టోన్‌హౌస్‌పేటలోని కార్యాలయంలో ఆర్ఐఓ వరప్రసాద్‌రావుకు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. జిల్లా కార్యదర్శి రాఖీ, నగర కార్యదర్శి సోనూ, నేతలు రాజీవ్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామ్ ముదిరాజ్ మాట్లాడారు. వేణుగోపాల్‌రెడ్డి సౌజన్యంతో పౌష్టికాహారాన్ని అందించామని చెప్పారు. మేయర్ స్రవంతి, తిరుపతినాయుడు, అనంతరామారావు, శేషగిరిరావు, రంగారావు, సాయి, సురేంద్రబాబు, రఘురామ్‌నాయుడు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పక్కాగా అమలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమ పథకాల గురించి మహిళకు వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అనికేపల్లి పంచాయతీలో గురువారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంత్రి కాకాణి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. జగనన్న పాలన సంతృప్తికరంగా ఉందంటూ ప్రతి ఒక్కరూ మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడంతో ప్రజాప్రతినిధులు ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన హామీలతో పాటు, ఇవ్వని హామీలను కూడా అమలు చేసి ప్రజాభిమానాన్ని చూరగొంటున్నారని కొనియాడారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా వినూత్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని తెలిపారు. అలాగే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఆలోచనతో 'జగనన్నకు చెబుతాం' కార్యక్రమానికి ప్రారంభించారని తెలిపారు.

చుక్కల భూమి సమస్యకు పరిష్కారం

జిల్లాలో చుక్కల భూముల సమస్యలను ఎదుర్కొంటున్న 23,023 మంది రైతులకు సంబంధించి 43,270 ఎకరాలకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కావలిలో లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. రైతులతోపాటు అన్నివర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. అనికేపల్లి పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులకు రూ.12.13 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, సర్పంచ్ కొమరగిరి శీనమ్మ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల అభివృద్ధే లక్ష్యం



గాయపడిన కుడుముల పుల్లయ్యకు నగదు అందజేస్తున్న నాయకులు

తోటపల్లిగూడూరు: గీత కార్మికుల అభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు జిల్లా గౌడ కల్లుగీత కార్మికుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని పేడూరు గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కుడుముల పుల్లయ్య ఇటీవల తాటిచెట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ క్రమంలో జిల్లా గౌడ కల్లుగీత కార్మికుల సంఘం తరఫున నాయకులు గురువారం బాధితుడి నివాసానికి వెళ్లి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లా గౌడ కల్లుగీత కార్మికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షుడు స్వర్గీయ కోసూరు గోవిందయ్య ఆశయాలను కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్, ఉపాధ్యక్షులు ఉప్పాల రామకృష్ణయ్యగౌడ్, తాతా సుబ్బారావుగౌడ్, దద్దోలు రామచంద్రయ్యగౌడ్, ఎల్లసిరి రాజేష్‌గౌడ్, కోసూరు చిన్నగోవిందయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట వేడుకలు

కోవూరు: మండలంలోని పడుగుపాడు ధాత్రి గ్రీన్ హోమ్స్ సముదాయంలో గురువారం శ్రీసీతారామ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు జరిగిన విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో ధాత్రి గ్రీన్ హోమ్స్ అధినేతలు దారపనేని శ్రీనివాసులునాయుడు, విజయకుమార్, హరికృష్ణ దంపతులు, డీపీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, డీఎల్‌డీపీ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ నాగేశ్వరరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ నవరత్నాల పథకాలు అందాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరసింహరావు

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు అర్హులందరికీ అందాలని ఎంపీడీఓ నరసింహరావు తెలిపారు. మండలంలోని పంచేడు, మినగల్లు గ్రామాల్లోని సచివాయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు సచివాలయాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగుల హాజరు వంద శాతం ఉండేలా, ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం



ముత్తుకూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జెడ్పీ హైస్కూళ్లకు సంబంధించి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని గురువారం ఉపాధ్యాయులు సన్మానించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఆలపాక మౌలిక పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 572 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని మౌలికను హెచ్‌ఎం చెంచురామయ్య శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యావనరుల కేంద్రం ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొడవలూరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జె.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ చిత్రలేఖన పోటీలతో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు శిబిరం ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలను వి.రమేష్, సుమతి పర్యవేక్షించారు.

వేసవి విజ్ఞాన శిబిరం

వెంకటాచలం: స్థానిక గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి కథలు చెప్పడం, క్విజ్, జనరల్ నాలెడ్జ్‌పై చర్చ, పాటలు పడడం, ఆటలు ఆడడం మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎ.రేవతి పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు

పొదలకూరు: ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం 25 శాతం విద్యార్థులను 1వ తరగతిలో చేర్చుకునేందుకు ఉచితంగా అడ్మిషన్లు జరుగుతున్నాయని ఇన్‌చార్జి ఎంఈఓ మధుసూదన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడత అడ్మిషన్లు పూర్తయ్యాయని, రెండో విడత అడ్మిషన్లకు అవకాశం ఉన్నందున అర్హులైన విద్యార్థులను తల్లిదండ్రులు వారికి సమీపంలోని పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అడ్మిషన్ల సందర్భంగా పాఠశాల యజమాన్యానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. 2009 విద్యాహక్కు చట్టాన్ని అనుసరించి ఉచిత నిర్బంధ విద్యలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ఉచితంగా చేస్తారని తెలిపారు.

సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు



వెంకటాచలం: సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న వరాల సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేకం, విశేష పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన కుంకాల ఏడుకొండలు, శ్రీలత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పొదలకూరులో..

పొదలకూరు: పట్టణంలోని షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం బాబాకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో భక్తులు బాబా భజనలు చేశారు. రాత్రి స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

అదనపు కమిషనర్‌గా శర్మదా



నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా శర్మదా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆమెకు నియామక ఉత్తర్వులను కమిషనర్ వికాస్ మర్మత్ తన చాంబర్‌లో గురువారం అందజేశారు. నెల్లూరు నగరపాలక సంస్థలో అదనపు కమిషనర్‌గా రెండేళ్ల క్రితం నియమితులైన ఆమె కొద్దికాలం తర్వాత డిప్యుటేషన్‌పై సెక్రటేరియెట్‌కు వెళ్లారు. తిరిగి ప్రస్తుతం అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

గణేష్ ఘాట్‌ను పరిశుభ్రంగా ఉంచాలి



గణేష్ ఘాట్‌ను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ తరహాలో నగరంలోని గణేష్ ఘాట్‌ను పరిశుభ్రంగా ఉంచేలా ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. 36వ డివిజన్ ఫతేఖాన్‌పేట, రైతుబజార్ శానిటేషన్ మస్టర్ పాయింట్‌ను గురువారం తనిఖీ చేశారు. అనంతరం శాంతినగర్, పోలీస్ క్వార్టర్స్, మూలాపేట, స్వర్ణాల చెరువు, గణేష్ ఘాట్, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గణేష్ ఘాట్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు పూర్తి చేయాలి

ప్రజలకు అందించే సేవల్లో ఏమైనా పెండింగ్ ఉంటే వాటిని గడువులోపు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. శోధన్‌నగర్, బ్రహ్మానందపురం, దండువారివీధి, బృందావనంలోని వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. భూ హక్కు సర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అనంతరం కస్తూరిదేవి గార్డెన్స్, రవీంద్రనాథ్ టాగూర్ కల్యాణ మండపాలను సందర్శించి యూజర్ చార్జీలను వెంటనే చెల్లించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణ పురోగతిపై దృష్టి పెట్టాలి



కాంట్రాక్టర్లు, అధికారులతో మాట్లాడుతున్న ఈఈ, డీఈ

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని గృహనిర్మాణశాఖ ఈఈ నగేష్ తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాల వెనుక ఉన్న జగనన్న లేఅవుట్‌తోపాటు పెద్దూరులో ఉన్న లేఅవుట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు, ఇళ్లు నిర్మిస్తున్న కాంట్రాక్టర్లకు ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. నాణ్యతలో రాజీ లేకుండా ఇళ్లు నిర్మించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. జగనన్న లేఅవుట్లలో లెవలింగ్, తాగునీటి వసతి, విద్యుత్ లైన్ల ఏర్పాటు, రోడ్లు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అర్బన్ ప్రాంతంలో లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకునేలా గృహనిర్మాణశాఖ అధికారులు, ఇంజినీర్ అసిస్టెంట్లు నిత్యం పర్యవేక్షించాలని తెలిపారు. ఆయన వెంట డీఈ దయాకర్, ఏఈ గౌస్‌మొహిద్దీన్ ఉన్నారు.

ఘనంగా ధ్వజారోహణ



గంగా కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

- కామాక్షితాయి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ పూజలు
- భక్తులకు కొడిముద్దల పంపిణీ



ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత గణపతి పూజ, స్వస్తివాచనం, దేవతా ఆహ్వానం, భేరీపూజ, ధ్వజపటానికి ఆవాహన పూజ, ఇంద్రాది అష్టదిక్పాలక ఆవాహన పూజ, ధ్వజానికి సంప్రోక్షణ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న ధ్వజస్తంభానికి నంది, త్రిశూలం, ఢమరకం, దర్భసూత్రంలను ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ఘనంగా ధ్వజారోహణ పూజలు నిర్వహించి కొడిగుడ్డ కట్టారు. అనంతరం కొడిముద్దలను భక్తులకు పంపిణీ చేశారు. వీటిని సంతానం లేని వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి వైభవంగా ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు వుక్కం చినబసవయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శివకుమార్, కొండా వైష్ణవి- వెంకటరామ్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, సుప్రజ, విమల, పద్మ, విజయమ్మ, కామేశ్వరి, శశిశేఖర్‌శర్మ, కౌన్సిలర్ లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోండి



ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

మనుబోలు: పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్మూరు డేవిడ్ సూచించారు. సైన్స్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దిగజారిన నిమ్మ ధరలు



పొదలకూరు మార్కెట్లో నిమ్మకాయలు

పొదలకూరు: నిమ్మ ధరలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. ఈ ఏడాది రైతులు ఆశించినట్లుగా ధరలు లేకపోవడంతో డీలా పడ్డారు. గతేడాదితో పోల్చి చూస్తే ఈ ఏడాది ధరలు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో ధరలు లూజు(బస్తా) రూ.2 వేల నుంచి రూ.4 వేలు మాత్రమే ఉంది. కిలోల లెక్కన కిలోకు రూ.25 నుంచి రూ.55 ధర పలుకుతోంది. సాధారణంగా మే నెలలో ధరలు పెరగాలి. అయితే ఏప్రిల్ నుంచే మార్కెట్లో ధరలు పెరగడం లేదు. ఈ ఏడాది టాప్ ధర అంటే రూ.6,500 మాత్రమే పలికింది. గతేడాది టాప్ రూ.14 వేల వరకు ధర పలికినట్లు రైతులు తెలిపారు. వేసవిలో నిమ్మకాయలకు డిమాండ్ పెరుగుతుంది. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నా ధరలు పెరగలేదని రైతులు చెబుతున్నారు. తోటల నుంచి కాయల దిగుబడి పెరిగినట్లు వ్యాపారులు వెల్లడిస్తున్నా, ఈ స్థాయిలో ధరలు పతనం కావడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రమాదంలో మృతిచెందిన గుర్తుతెలియని యువకుడు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పి పడిపోయి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ఇస్కపాళెం సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు ముత్తుకూరు మండలం పంటపాళెంలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేసే ముగ్గురు వ్యక్తులు సర్వేపల్లి వైపు నుంచి ఇస్కపాళెం వెళుతుండగా, మలుపు రోడ్డు వద్ద అదుపుతప్పి బైక్ పడిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు 25 సంవత్సరాలు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. బైక్‌పై ప్రయాణిస్తున్న మిగతా ఇద్దరు వ్యక్తులు ఘటనా స్థలం నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్సై అయ్యప్ప ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీలో షార్ట్‌సర్క్యూట్



నెల్లూరు(క్రైమ్): ఏసీలో వైర్లు షార్ట్ సర్క్యూటై అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన బాలాజీనగర్ పరిధిలోని రామ్‌నగర్‌లో గురువారం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు.. రామ్‌నగర్‌లోని మూడోవీధిలో శివకుమార్ కుటుంబం నివాసం ఉంటోంది. ఏసీలో వైర్లు షార్ట్ సర్క్యూటై అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో ఇంట్లోని వారు బయటకు పరుగులు తీసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే పడక గదిలోని వస్తువులతో పాటు విలువైన గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.నాలుగు లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.